# ఊతకర్ర



నేను తండ్రిని. 'తండ్రి!' అని పిలిపించుకొనే అవకాశం కల్పించింది నా భార్య. ఆమె లక్షణంగా ఉంది. మేం ఇద్దరం. మాకు ఇద్దరు. ఒక కొడుకు, ఒక కూతురు. కొడుక్కి పెళ్ళీ అయింది. కూతురికి అయింది. కొడుక్కి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. కూతురికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అందరూ ఉన్నారు. విలాసంగా... వినోదంగా... తమ బతుకులు తమవిగా... తమ పాలిటికదే ఒక స్వర్గంగా. ఎక్కడ? ఎక్కడో సుదూర ప్రాంతాల్లో!... సరికొత్త తీరాల్లో!...

నా గుండె అట్టడుగు పొరల్లో నుండి పుట్టుతుందీ భావం. అయితే అది అక్కడే ఆగదు. పోనీ గొంతుదాకా సాగుతుందా అంటే సాగదు. గొంతుదాకా రానప్పుడు మాటగా మారే ప్రసక్తేలేదు. కానీ ఆ భావం ఒక స్మృతిగా... ఒక ఆవేదనగా... ఒక ఆలోచనగా గుండె అట్టడుగు పొరల్లో నుండి భారంగా లేస్తుంది. సరాసరి మెదడును తాకుతుంది. ఆ దెబ్బతో కళ్ళు పొరలు కమ్ముతాయి. ఆ పొరలను చీల్చుకొని కనుకొలకుల్లో కన్నీళ్ళు!...

అది అంతటితో ఆగిపోదు.

ఆగిపోతే దానిని గురించి ఆలోచించవలసిన అవసరమే ఉండేది కాదు.

కూర్చున్నా...లేచి నడుస్తున్నా... పడుకొని విశ్రాంతి తీసుకొంటున్నా ఈ భావం అలలు అలలగా లేస్తుంది. అలలైతే ఒక దాని వెంట మరొకటి. భావం ఒక్కటే. ఒకే భావం మాటిమాటికీ మెదడనే ఒడ్డును తాకుతుంది. మళ్ళీ వెనక్కు వెళ్ళిపోతుంది. గుండె అట్టడుగు పొరలకు మెదడుకు మధ్య ఆగకుండా సాగుతున్న ఈ కొట్టుమిట్టాట నిట్టూర్పులుగా మారి ఆ ఇంటిని నింపేస్తే... కనుకొలకుల్లో కన్నీళ్ళు ఆవిరై గాలిలో కలిసిపోతూ!

నాకొక ఇల్లు ఉంది. ఆ ఇంట్లో నిద్రకూ భద్రతకూ వంటా వార్పుకూ స్నానానికి పానానికి వేర్వేరుగా గదులున్నాయి. ఏ గదికి తగిన అలంకరణ ఆగదికుంది. అయితే ఇప్పుడా గదులన్నీ నిట్టూర్పుల దుమ్ములో నిండి పీడకళ కొడుతూ ఉంటాయి.

ఆ రోజు నాకా ఇంట్లో భారంగానే తెల్లారింది. ఆ రోజు మాత్రమే కాదు– గత ఏడాదిగా ప్రతిరోజూ భారంగానే తెల్లారుతూ ఉంది.

ప్రతిరోజూ తెల్లారక ముందే నిద్ర లేస్తాను. కాలకృత్యాలు తీర్చుకొంటాను రెండు కిలోమీటర్లు తక్కువగాకుండా తప్పనిసరిగా నడుస్తాను. ఇంటికి తిరిగి వస్తాను. స్నానం చేస్తాను. ఆ తర్వాత పత్రిక చేతికి తీసుకొంటాను. ఆ పత్రికను మాత్రం ఎంత సేపని చదువుతాను? ఆకలవుతుంది. అయినా ఎవరున్నారు– కడుపు చూసి కాకపోయినా ఆకలెరిగి అంత టిఫిన్ పెట్టడానికి? అందుకే పత్రిక మీది చూపు వీధి తట్టు మరలుతుంది. ఎవడైనా ఒక పిల్లవాడు ఆ దారిని పోతూ కనిపిస్తే చాలు. పిలుస్తాను. వాడి చేతిలో పావలా పరక లంచం పెడతాను. దగ్గర్లో ఉన్న హోటల్లో నుండి అంత టిఫిన్ తెమ్మంటాను. వాడు ఒకటి తెమ్మంటే ఇంకొకటి తేవచ్చు. రాజీపడక తప్పదు. నేనే వెళ్ళవచ్చు. వెళ్ళి రావడం సమస్యకాదు. కానీ ఆ ఊళ్ళో బతికిన బతుకొకటి ఏడ్చింది గదా?

ఆకలి రుచి ఎరగని సంగతి కొత్తకాదు.

గంట పదవుతుంది. అప్పుడు వంట మనిషి వస్తుంది. ఆమె వంట మాత్రం చేస్తుంది. అది కూలిసేద్యం. ఏదో తనకు తోచినట్లు లేదా తెలిసినట్లు అంత ఉడకపెడుతుంది. బియ్యం పప్పు కూరలు ఉడికి రూపాంతరం చెందితే అవి వంటలు. వాటిని పాత్రల్లో పెట్టి డైనింగ్ హాల్లో చక్కగా సర్దిపెడుతుంది. ఎవరైతే ఏం పాపం? చాలా జాగ్రత్తగా మూతలు కూడా పెడుతుంది. తన దారిన తాను వెళ్ళిపోతుంది.

నాకు అదే లంచ్!... అదే డిన్నర్!...

లంచ్‌కీ డిన్నర్‌కీ ఒక్కటే తేడా. లంచ్ కొంచెం వేడిమీద ఉంటే ఉంటుంది. అదే డిన్నర్ బాగా చల్లబడి ఒక్కొక్కరోజు పాచికంపు కొడుతూ ఉంటుంది. అలాంటి సమయల్లో పేగులను మంచినీళ్ళతో మంచి చేసుకోవడమే తప్పనిసరి.

మనిషికి అరవైయేండ్లు పైబడడమంటే ఊతకర్ర చేతికి రావడమే. జీవిత చరమాంకంలో అడుగుపెట్టిన దశలో మనిషికి ఆలనాపాలనా కరువైతే?... ఆత్మీయతానురాగాలు దూరమైతే?...

ఒంటరితనం ఒక దయ్యమై పీడిస్తూంటే?... నిస్సహాయత నిస్సత్తువ నీడలా వెన్నాడుతూ ఉంటే?... ఒక్క దినం గడవడం ఒక్క యుగం గడిచినట్లుగా భారమైతే?...

ఏటికి ఎదురీదుతున్నట్లే జీవితం!

ఒక్క ఏడాదికిపైగా ఏటికి ఎదురీది ఎదురీది బాగా అలిసిపోయాను. ఇక ఈదడం నా తరం కానిపని. అదే కూర్చొని ఆలోచిస్తున్నాను.

మండు వేసవి. పది గంటలకే సూర్యకిరణాలు సూదులు గుచ్చినట్లు గుచ్చుతున్నాయి. డైనింగ్ హాల్లో కూర్చున్నాను. ఉదయాన ఎవడో పిల్లవాడితో తెప్పించి పెట్టుకొన్న ఇడ్లీలు తిందామని ప్లేట్లో పెట్టుకొన్నాను. తాగడానికి నీళ్ళు కావాలి. కావాలంటే లేచిపోయి తెచ్చుకోవాలి. బతికినంత బతుకూ బతికి ఒక్క లోటానీళ్ళు తెచ్చిపెట్టడానికి ఈ వయస్సులో దిక్కులేక పోయారే? అనుకొనేసరికి మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది. దానిదారి దానిదిగా గతంలోకి...చూపులు శూన్యంలోకి... ఇడ్లీల గతి ఈగల జోలికి!...

"ఇడ్లీలు ఆరిపోతా ఉండాయి. వాటిమీద ఈగలు కూడా ముసర్తా ఉండాయి. అంత తినేసి మల్లా కావాలంటే కూసోండయ్యా!" ఇంట్లో అప్పుడే అడుగు పెట్టిన వంటమనిషి హెచ్చరించింది. ఆ మాటతో 'ఆఁ! ఊఁ!' అన్నానే కానీ మనసు స్వాధీనానికి రాలేదు.

ఆమె వంట మనిషి. చెప్పడం వరకే తనపని. ఆ పని చేసింది. అంతటితో తన బాధ్యత తీరిపోయినట్లుగా తన పనిలోతాను. అంత ఉడకబెట్టి పెట్టింది. తనదారిని తాను వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోవడం తెలుస్తూనే ఉంది. ఇడ్లీల మీద ఈగలు ముసురుతున్నాయి. చూస్తున్నాను. ఇంటిముందు రోడ్డు మీద కార్లు మోటార్లు పంతాలు మీద పరుగులు తీస్తున్నాయి. చెట్టు మీద కాకి అరుస్తూ ఉంది. యాంత్రికంగా సాగిపోతున్న ఈ బాహ్య సంఘటన లేవీ ఆలోచనలకు అంతరాయం కలిగించడం లేదు!.

అవును. ఆ రోజుల్లో నేనే మనుకొన్నాను! ఈ దేశంలో ఒక మేధావిగా పుట్టడమే శాపం అనుకొన్నాను. మేధను గుర్తించి గౌరవించలేని ఈ దేశం ఏ పరిస్థితుల్లోనూ అభివృద్ధి సాధించడం కల్ల అనుకొన్నాను. అందుకే నాగతి నా బిడ్డలకు పట్టకూడదని శ్రద్ధ తీసుక్నాను. నా కృషి వృథా కాలేదు. నా ఆశయం నెరవేరింది. కూతురు డాక్టరుగా కొడుకు ఇంజనీర్‌గా అమెరికా వెళ్ళడానికి అవకాశం. ఓహ్! నా జీవితమే ధన్యమైనట్లు పొంగి పోయాను. నా బిడ్డలు అమెరికాలో గొప్ప గొప్ప మేధావులతో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభవం. అంతకు మించిన అదృష్టం. ఆ అనుభవంతో అమెరికాలోనే కాదు దేశదేశాల్లో కూడా వాళ్ళు పేరు పొందవచ్చు. చాలు. ఈ జన్మకీ తృప్తి చాలని సంతోషించాను. గర్వించాను కూడా. అయితే ఏమయింది? పోతే తెలిసింది అవి దూరపు కొండలని. వాళ్ళు కేవలం యంత్రాలుగా మిగిలిపోయారు. యంత్రాలు పనిచేస్తుంటాయి– అలుపూ సొలుపూ ఎరక్కుండా. వాటికి ఆత్మీయతలు, అనురాగాలు ఏమీ అక్కర్లేదు. వాటితో పోటీ పడ్తూ వీళ్ళూ.

పని!...పని!!...పని!!!...డబ్బు!....డబ్బు!!....డబ్బు!!!....ఈ రెండింటితో ముడిపడిందేనా జీవితం? జీవితమంటే యంత్రాల్లా పని చేయడం... యంత్రాల్లా ప్రేమించుకోవడం... యంత్రాల్లా బతకడం.... బతకలేనప్పుడు యంత్రాల్లో భాగాలుగా విడిపోవడం!.

ఇంతేనా?

ఈ సంస్కృతి మన సంస్కృతికి చుక్కెదురు కాదా?

ఒక విధంగా ఆలోచిస్తే- ఒక విధంగా కాదు. ఏవిధంగా ఆలోచించినా నేను పొరబాటు చేశాను. ఆ పొరబాటే చేయకుంటే ఇప్పుడిలా బాధపడడానికి ఆస్కారమే ఉండేదికాదు. 'నాన్నా! ఈ వయస్సులో మీరక్కడుండి ఏంచేస్తారు? ఇక్కడికొచ్చేయండి. మీకు కాలం గడిచినట్టు. మాకు తోడున్నట్లు' అని రాస్తే అంతకంటే భాగ్యం ఏముందని నేనూ భార్య రెక్కలు గట్టుకొని ఎగిరిపోయాం. అక్కడ కొడుకూ కూతురూ పోట్లాడి మమ్మల్ని పంచుకొన్నారు. ఆమె కొడుకు వద్ద. నేను కూతురువద్ద.

అక్కడ జీవితం అనుభవిస్తే తెలిసింది. అవి పంజరంలో చిలుకలతో పోటీపడే బతుకులని. లేకుంటే వాళ్ళేదో ఒక భూలోక స్వర్గంలో ఉన్నారన్న తృప్తితోనే ఈ జీవితం కడతేరి పోయేదేమో?

ఆ బతుకులు! ఏం బతుకులో? కాలంతో పోటీపడ్తూ కార్ల మీద పరుగులు. ఎప్పుడు నిద్రలేస్తారో? ఏం తింటారో? ఉరుకులు పరుగులు. తల్లిదండ్రుల దారి తల్లిదండ్రులది. పిల్లల దారి పిల్లలది. మళ్ళీ ఏ సాయంకాలానికో ఇంటి ముఖం చూసేది. అప్పుడు చూడాలి వాళ్ళ ముఖాలను. వాడి వత్తలైన తోటకూర కాడలే నయం. వచ్చీ రావడంతోనే విశ్రాంతి పేరుతో ఎవరి గదుల్లో వాళ్ళు దూరుకొంటారు. ఒక కలిసి భోంచేడమా? కాలక్షేపానికి కబుర్లా? ఒక ముద్దూ ముచ్చటా? ఏమీ లేదు. ఎవరికి వాళ్ళే వాళ్ళ లోకంలో. ఆ రాత్రి ఎవరికి తోచినప్పుడు వాళ్ళు లేచి అంత ఎంగిలి పడతారు. మళ్ళీ తెల్లారుతుంది. తెల్లార్తే ఏముంది? ఎక్కడో కొంపలు మునిగిపోతున్నట్లు ఆశయాల ఆశ్వాసాల్లో ఆశలబిందులు!

అక్కడ గడిచింది ఒక అందమైన జైలు శిక్ష. ఒక ఇరుగూ పొరుగూ లేదు. అటూ ఇటు తిరగడానికి లేదు. ఒక మాటామంతీ లేదు. ఆ గదిలో బందీగా ఎంత కాలం? చదువుకోవడానికి పుస్తకాలున్నాయి. చూడడానికి లెక్కలేనన్ని ఛానల్సుతో టీవీలున్నాయి. అయినా ఎంతసేపని చదవగలం? ఎంతసేపని చూడగలం? అందుకే ఉచ్చులు తెంపుకొని వచ్చేశాను-నా భార్య రానన్నా. ఈ గాలికోసరం...ఈ మట్టికోసరం... ఈ స్వేచ్ఛకోసరం!-

మరి వాళ్ళ పిల్లలు?- వాళ్ళు అమెరికాలో పుట్టిన పిల్లలు. ఏగూటి చిలక ఆ గూటి పలుకు. వాడు నా మనవడు. వేలెడెంతలేడు వెధవ. వాడు నన్ను నిలదీయడం?- మరిచిపోదామంటే కాలేదే?-

"చూడు తాతయ్యా! మా మమ్మీడాడీ- మా మాతృదేశం చాలా గొప్పది. మా సంస్కృతీ సంస్కారాలు గొప్పవి. ఆచార వ్యవహారాలు అంతకంటే గొప్పవి. వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తే లేదని ఊదరగొడుతుంటారే? మరి అంత గొప్ప దేశాన్ని వదిలిపెట్టి వాళ్ళిక్కడికెందుకు రావాలి?"

"ఆమాట వాళ్ళనే అడగలేకపోయావా?"

"అడిగితే మాకోసరం అంటారు. మా కోసరమే అయినప్పుడు మా దారికి మమ్మల్ని వదిలేయాలికదా? మేము ఇక్కడే పుట్టాం. ఇది మా మాతృభూమి. మా మాతృభూమిని మేము గౌరవించాల్సిన అవసరం లేదా?"

ఆంగ్లంలో వాడు ముద్దుముద్దుగా వాదిస్తూ ఉంటే నాకు నవ్వు వచ్చేది. వాడికేమని బదులు చెప్పేది?– తల్లిదండ్రుల్లో బిడ్డల భవిష్యత్తుకు సంబంధించిన ఆవేదన ఉంది. పిల్లల వాదనలో బలం ఉంది. ఎవరికి వాళ్ళుగా మౌనంగా నలుగుతున్నారు. మన ఆచార వ్యవహారాలు మింగుడుపడకుండా అక్కడి వాతావరణంలో మమేకం చెందలేకుండా పిల్లలు సెకండ్ రేట్ పౌరులుగా మిగిలిపోతారేమో అని మధన. నిజానికి ఆ పిల్లలు అటుయిటు కాకుండా మిగిలిన సరికొత్త తరాలు. ఈ సరికొత్త తరాలు తరంకాని తరాలుగా ఏ తీరాలు చేరతారో అని తల్లిదండ్రులు తపించిపోతున్నారు.

హుఁ! ఎంత చిత్రమయిందీ జీవితం! నా జీవిత పోరాటమంతా 'నా బిడ్డలు!... నా బిడ్డలు!' అన్న తపనతో తాపత్రయంలో. అదే నా బిడ్డల ఆరాట పోరాటాలు తమ బిడ్డల కోసరం. ఎవరైనా తమ బిడ్డల్ని గురించి ఆలోచిస్తున్నారేకానీ తాము కూడా ఒకరికి బిడ్డలమన్న సంగతే మరిచిపోతున్నారు. అందుకే ఎందరో నావంటి అభాగ్యుల జీవితాలు అన్నీ ఉంది అల్లుడి నోట్లో శనిగా మిగిలిపోతున్నారు.

ఒకరోజు ఇలాంటి ఆలోచనలతోనే మనసు గజిబిజిగా ఉండి, ఇంట్లో ఇమడలేక బయటపడ్డాను. తుమ్మెద ఒక పూవు నుండి మరొక పువ్వు మీదికి ఎగిరినంత వేగంగా ఒకదానివెంట మరొక ఆలోచన. ఆ ఆలోచనా వేగాన్ని అందుకోవాలన్నట్లుగా నడుస్తున్నాను. అలా ఎంత దూరం నడిచానో నాకే గుర్తులేదు. ఒంట్లో ఓపిక నశించింది. నిలబడ్డాను. ఎండ మాడుపగలగొడుతూ ఉంది. అటుయిటు చూశాను. బాట పక్కనే చెట్టు. ఆ చెట్టు కిందికి చేరాను. ఆ చెట్టు శాఖోపశాఖలుగా విస్తరించింది. అది ఎంత పెద్ద చెట్టయినా పెంచితే పెరిగిన చెట్టే కదా?– అయితే ఆచెట్టు నీడనిస్తూ ఉంది.

అక్కడికి కనుచూపు దూరంలో ఒక పల్లె. ఆ ఎండలో అంతదూరం నన్ను ఏ శక్తి లాక్కొని వెళ్ళిందో మరి? తిరిగి ఇల్లు చేరాలికదా అనుకొనేసరికి గుండె గభీమనింది. అయినా తప్పదుకదా? అదే ఆలోచిస్తూ ఆ చెట్టు కింద కూర్చొని అలుపు తీర్చుకొంటున్నాను. అప్పుడొక సంఘటన నా దృష్టిని ఆకర్షించింది.

ఆ చెట్టు దగ్గరగా బాట పక్కనే కొత్తగా కట్టిన మూదంకణాల ఇల్లు. ఆ ఇంటిని బోదకసువుతో కప్పుతున్నాడొక వ్యక్తి. నిప్పులు చెరుగుతున్న ఎండ. ఆ ఎండకు తోడు కాలిన బోదకసువు కక్కుతున్న వేడి. ఆ మనిషి ఒంటిమీద ధారలు ధారలుగా చెమట. అయినా అతడదేమీ పట్టించుకోవడంలేదు. అది తండ్రి కంటపడింది. కన్నపేగు మెలిపడింది. దాంతో ఆ ముసలికట్టె ఊతకట్టె మీదికి వంగి తలపైకెత్తి మండేవాడికి అరచేతిని అడ్డంగా పెట్టి

కొడుకును చూస్తూ "ఒరే నాయినా! పొద్దు తిరిగిపోతా ఉందాది. ఇప్పుడు ఆడేం మునిగిపోతా ఉందాదిరా? కొంచెం చల్లబడ్డాక కప్పుకోవచ్చు గదా? దిగిరారా. అంత తినేసి ఒక వక్కకొరికినంతసేపన్నా పడి లెయ్‌రాదంట్రా?" అని బతిమాలుతున్నాడు.

"అయ్‌పోనీ... ఒకసారిగా అంతా అయ్‌పోనీ. ఈ రోంతకోసరం మళ్లీదిగి మళ్లీ ఎక్కాల్నా?" అంటూ తండ్రిమాట పెడచెవినిపెడ్తూ కొడుకు.

కన్నపేగు అభిమానం ఆమాటతో దెబ్బతిన్నట్లుంది. కొంతసేపు కొడుకును రెప్పార్పకుండా చూశాడు.తలపంకించాడు. మెల్లిగా ఇంట్లోకి నడిచాడు. అయితే వెళ్ళినట్లుగానే తిరిగి వచ్చాడు మూడు నాలుగేండ్ల పసిగుడ్డును చంకనేసుకొని. మనవడేమో? వాణ్ణి ఆ మండే ఎండలో నిలబెట్టి ఇంట్లోకి జారుకొన్నాడు. చిదిమితే పాలుగారే పాదాలు. చుర్రుమన్నాయి. పిల్లవాడు కెవ్వుమన్నాడు. అది ఇల్లు కప్పుతున్న మనిషి చెవుల్లో పడింది.

"అయ్యయ్యో! పసిబిడ్డ ఎండన పణ్ణాడే? కొంపలో వాళ్ళంతా యాడ చచ్చినట్లు?" అంటూ గబగబ దిగాడు. బిడ్డను జవురుకొన్నాడు.

అది అంతే! కాకిపిల్ల కాకికి ముద్దు. అయితే ఆ కాకి ఇంకొక కాకికి పిల్లేకదా? ఆ సంగతి గుర్తురాదే? ఈ సంఘటన తండ్రీబిడ్డల మధ్య అనుబంధానికి చక్కని నిదర్శనంగా అప్పుడప్పుడు నన్ను ఊరడించేది. ఉపదేశించేది కూడా!–

'పోస్ట్!' అన్న కేకతో నా ఆలోచన తెగిపోయింది. పైకి లేచాను. ఇంటి వాకిట్లోకి నడిచాను. రిజిష్టర్ పార్సల్ చేతపట్టుకొని పోస్ట్‌మెన్– నవ్వుతూ. సంతకం పెట్టి ఆ పార్సల్ తీసుకొన్నాను. విప్పాను.

అది ఊతకర్ర– అమెరికన్ ఊతకర్ర!!...

నేను మరిచిపోయిన నా పుట్టిన రోజును గుర్తు చేస్తూ ఎంతో ఆప్యాయంగా నావాళ్ళు పంపిన పుట్టిన రోజు కానుక. ఊతకర్ర కానుక చాలా అందంగా ఉంది. ఆ కర్ర చేతపట్టుకొంటే నాకెంతో హుందాతనం వచ్చినట్లుంది. అయితే కేవలం అది ఒక కట్టె. అయినా ఆ కట్టె చేతికి ఆధారమై నడిపిస్తుంది. కాటికి మోస్తుంది. ఈ కట్టెను కడతేరుస్తుంది. ఈ కట్టెకు మట్టికి ఉన్న మనసు మనిషికి లేదే? మనసు లేని మనుషులు పంపిన ఈ కట్టెలో ఆత్మీయతలు అనుబంధాలు వెదుక్కొంటూ ఎన్నాళ్ళీ కట్టె?...

ముత్తెమంత కన్నీటి చుక్క మెరిసిపోతున్న ఊతకర్ర మీద పడి జారుతూ!... ●

**ఈనాడు ఆదివారం**
(23, మార్చి 1997)